


Wanted Reporters: 9618907705

RNI No: APTEL/2018/76747

# నవతరం

సామాజిక, రాజకీయ తెలుగు దినపత్రిక

| హైదరాబాద్ | మంగళవారం | సంపుటి: 9 | సంచిక: 229 | పేజీలు: 04 | వెల: 5 /- | 18 ఆగస్టు 2026 |

### కొడుకుతో కలిసి మహిళ హత్యలు

## సిద్దిపేటలో.. సీరియల్ కిల్లర్

- సిద్దిపేట జిల్లాలో మహిళల వరుస హత్యల కేసును ఛేదించిన పోలీసులు
- మైనర్ కొడుకుతో కలిసి ఇద్దరు మహిళలను హత్య చేసిన మహిళ అరెస్ట్
- బంగారం, డబ్బు కోసమే ఈ దారుణాలకు పాల్పడినట్లు వెల్లడి
- భర్తను చంపి బీమా డబ్బులు కొట్టేయాలని కూడా ప్లాన్ చేసిన నిందితురాలు



**సిద్దిపేట, నవతరం:** సిద్దిపేట జిల్లాలో కలకలం రేపిన మహిళల వరుస హత్యల కేసు మిస్టరీని పోలీసులు ఛేదించారు. డబ్బు, బంగారం కోసం కన్న కొడుకు (మైనర్)తో కలిసి ఓ మహిళే ఈ ఘాతుకాలకు పాల్పడినట్లు తేల్చారు. ఇద్దరు మహిళలను గొంతు నులిమి హత్య చేసి, ఆనవాళ్లు లేకుండా పెట్రోల్ పోసి కాల్చివేసినట్లు గుర్తించారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను సిద్దిపేట పోలీస్ కమిషనర్ రమేశ్ మీడియాకు వెల్లడించారు.

దుబ్బాక మండలం భూంపల్లి గ్రామానికి చెందిన చాకలి రజిత, అనారోగ్యంతో బాధపడుతున్న భర్త, మైనర్ కుమారుడితో కలిసి నివసిస్తోంది. ఓ కిరాణా దుకాణం నడుపుతున్న ఆమె, సులభంగా డబ్బు సంపాదించాలనే దురాశతో హత్యలకు పథకం పన్నింది. తన మైనర్ కొడుకును కూడా ఈ నేరంలో భాగస్వామిని చేసింది. ఒంటరిగా ఉండే మహిళలను, కుటుంబ తగాదాలు ఉన్నవారిని లక్ష్యంగా చేసుకుంటే అనుమానం తమపైకి రాదని భావించి పక్కా ప్రణాళికతో హత్యలు చేశారు.

ఈ ఏడాది మే నెలలో రేఖ (25) అనే యువతిని తొలి టార్గెట్‌గా ఎంచుకున్నారు. ఇన్‌స్టాగ్రామ్‌లో చురుగ్గా ఉండే ఆమెను హత్య చేస్తే, ఎవరైనా కిడ్నాప్ చేశారనే అనుమానాలు వస్తాయని భావించారు. ఆమెను చంపి, ఒంటిపై ఉన్న బంగారాన్ని దోచుకుని, మృతదేహాన్ని అడవిలో కాల్చివేశారు. ఇక ఈ నెల 7న భూతగాదాలు ఉన్న అతికం విజయ (45)ను రెండో లక్ష్యంగా చేసుకున్నారు. ఆమె హత్యకు గురైతే అనుమానం ఆమె దాయాదులపైకి వెళ్తుందని ప్లాన్ చేశారు. హత్య అనంతరం మృతదేహాన్ని కాల్చేందుకు ప్రయత్నించగా వర్షం పడటంతో, రామక్కపేట వద్ద రోడ్డు పక్కన సగం కాలిన స్థితిలో వదిలేసి వెళ్లారు. దీనిని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు.

రంగంలోకి దిగిన పోలీసులు సీసీటీవీ ఫుటేజీల ఆధారంగా నిందితులు రజిత, ఆమె కుమారుడిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో వారు చెప్పిన విషయాలు విని పోలీసులు నివ్వెరపోయారు. ఈ రెండు హత్యలే కాకుండా, జూన్‌లో అన్నపూర్ణ అనే మరో మహిళపై దాడి చేసి బంగారు గొలుసు లాక్కెళ్లినట్లు అంగీకరించారు. అంతేకాదు, అనారోగ్యంతో ఉన్న తన భర్త దుబ్బయ్య పేరు మీద ఇన్సూరెన్స్ చేయించి, ఆయన్ను కూడా హత్య చేయాలని చూసినట్లు, మరో ముగ్గురు మహిళలను చంపేందుకు ప్రణాళికలు వేసినట్లు ఒప్పుకున్నారు.

నిందితుల నుంచి రూ. 10 లక్షల విలువైన బంగారం, వెండి ఆభరణాలతో పాటు రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు కమిషనర్ తెలిపారు. ప్రధాన నిందితురాలు రజితను రిమాండ్‌కు తరలించగా, మైనర్ బాలుడిని జువైనల్ హోమ్‌కు పంపినట్లు వివరించారు.






### నేరుగా ఓటుతోనే మేయర్, చైర్మన్!

## ప్రజలే సర్కారు

- 45 రోజుల్లో తుది పోరు.. గడియారం టిక్ టిక్!
- 100 పురాల్లో వార్డుల కొత్త మ్యాప్.. కదం తొక్కిన యంత్రాంగం
- సెప్టెంబర్ ఆఖర్లో సామాజిక న్యాయానికి స్టాంపు!



తలగాపు వెంకటరమణ( ఫ్రీ లాన్స్ జర్నలిస్ట్) 7995933607

**పలాస , నవతరం:** పట్టణ ప్రజల చిరకాల కోరిక నెరవేరబోతోంది. ఇన్నాళ్లు పరోక్షంగా జరిగిన నగర, పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలకు స్వస్తి పలికి, ఇకపై మేయర్, చైర్మన్ పదవులను ప్రజలే నేరుగా ఓటు ద్వారా ఎన్నుకునే చారిత్రక నిర్ణయానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ప్రజాస్వామ్యంలో ప్రజలే ప్రధానం అనే సూత్రానికి నిజమైన అర్థం ఇచ్చే ఈ సంస్కరణతో స్థానిక పాలనలో కొత్త అధ్యాయం మొదలు కానుంది. డబ్బు, పలుకుబడికి అతీతంగా, ప్రజా సమస్యలపై అవగాహన ఉన్న నాయకత్వానికే పట్టం కట్టే అవకాశం ఇప్పుడు ప్రతి ఓటరు చేతిలోకి రానుంది. రాబోయే 45 రోజుల్లో రాష్ట్రంలోని 123 నగర, పట్టణ స్థానిక సంస్థల్లో ఈ ప్రత్యక్ష ఎన్నికల ప్రక్రియ పూర్తి కానుంది.

పట్టణ పాలన చరిత్రలో ఇది ఒక మలుపు. 1986 మున్సిపల్ చట్టం అమల్లోకి వచ్చిన తరువాత, 2005లో చేసిన సవరణలతో పాటు ఇప్పటివరకు కౌన్సిలర్లే తమలో ఒకరిని మేయర్ గా, చైర్మన్ గా ఎన్నుకునేవారు. ఈ విధానంలో డబ్బు ప్రభావం, పలుకుబడి ఆటలు, గుంపు రాజకీయాలు పెరిగిపోయాయి. ప్రజలు ఓటు వేసి గెలిపించినా, చివరికి పదవి దక్కేది మాత్రం లెక్కల్లో గెలిచిన వారికే అనే అసంతృప్తి ప్రజల్లో ఉండేది. "ఓటు మాది, కానీ నిర్ణయం వేరొకరిది" అనే భావన ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధంగా ఉందని పలువురు అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో ప్రజలకు నేరుగా తమ నాయకుడిని ఎన్నుకునే అవకాశం ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు చట్ట సవరణ బిల్లును రేపటి నుంచి ప్రారంభమయ్యే అసెంబ్లీ వర్షాకాల సమావేశాల్లో ప్రవేశపెట్టనున్నారు. ఎన్నికల ప్రక్రియను వేగంగా పూర్తి చేయడానికి ప్రభుత్వం 45 రోజుల కాలపట్టికను ఖరారు చేసింది. ఈ 45 రోజులు పట్టణాల్లో రాజకీయంగా అత్యంత కీలకంగా మారనున్నాయి. ఇందులో మొదటి అడుగు వార్డుల పునర్విభజన. రాష్ట్రంలో మొత్తం 123 పట్టణ స్థానిక సంస్థలు ఉండగా, ఇప్పటికే 100 సంస్థలకు వార్డుల పునర్విభజనకు సంబంధించి అధికారిక నోటీసులు జారీ అయ్యాయి. మిగిలిన 23 సంస్థల్లో కూడా ప్రక్రియను శరవేగంగా పూర్తి చేయాలని జిల్లా అధికారులకు ఆదేశాలు అందాయి. వార్డుల విభజనలో జనాభా లెక్కలు, భౌగోళిక విస్తీర్ణం, రహదారులు, సహజ సరిహద్దులను ప్రధానంగా పరిగణనలోకి తీసుకుంటున్నారు. "ఒక వార్డులోని ప్రజల సమస్యలు మరో వార్డుతో కలవకుండా" ఉండేలా సరిహద్దులు గీయడమే లక్ష్యం.

రిజర్వేషన్ల అమలు విషయంలో ప్రభుత్వం సామాజిక న్యాయానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తోంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు, మహిళలకు తగిన ప్రాతినిధ్యం దక్కేలా వార్డులను కేటాయించనున్నారు. ఈ మొత్తం ప్రక్రియను సెప్టెంబర్ 25, 26 తేదీలలోపు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఆ తర్వాత 27వ తేదీ నుంచి 30వ తేదీ వరకు ముసాయిదా జాబితాపై అభ్యంతరాలు, సూచనలు స్వీకరించి, వాటిని పరిష్కరించి తుది జాబితాను అధికార గెజిట్ లో ప్రచురిస్తారు. బీసీలకు 34 శాతం రిజర్వేషన్ ఇవ్వాలనే ఎన్నికల హామీని అమలు చేసే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోంది. ప్రత్యేక కమిషన్ 27 శాతం సిఫారసు చేసినప్పటికీ, అసెంబ్లీలో జరిగే చర్చల అనంతరం తుది నిర్ణయం వెలువడుతుంది. "అందరికీ సమాన అవకాశం, అన్ని వర్గాలకు సముచిత ప్రాతినిధ్యం" అనేదే ఈ ప్రక్రియలో ప్రభుత్వ ప్రధాన ఉద్దేశం.

ప్రత్యక్ష ఎన్నికల విధానం అమల్లోకి వస్తే పట్టణ పాలనలో అనేక సానుకూల మార్పులు వస్తాయని అంచనా. మొట్టమొదటిది జవాబుదారీతనం. ఇప్పటివరకు కౌన్సిలర్లకు మాత్రమే జవాబు చెప్పాల్సిన మేయర్, చైర్మన్ ఇకపై నేరుగా కోటి మంది ప్రజలకు జవాబుదారీగా

మిగతా 4లో..

## స్వాతంత్ర్య దినోత్సవానికి ముందే భారీ కుట్ర భగ్నం

డా. నర్సింలు ఎల్లంపల్లి, బ్యూరో చీఫ్, తెలంగాణ రాష్ట్రం



**న్యూ ఢిల్లీ, నవతరం:** పాకిస్థాన్ ఐఎస్ఐ మద్దతుతో కార్యకలాపాలు సాగిస్తున్న 'షాజాద్ భట్టి నెట్‌వర్క్' అనే ఉగ్రవాద ముఠాను పూర్తిగా నిర్మూలించినట్లు కేంద్ర హోంమంత్రి అమిత్ షా సోమవారం ప్రకటించారు. స్వాతంత్ర్య దినోత్సవానికి ముందే దేశంలో విధ్వంసక దాడులు చేసేందుకు పన్నిన భారీ కుట్రను భద్రతా బలగాలు భగ్నం చేశాయని, ఈ క్రమంలో 14 రాష్ట్రాల్లో 200 మందికి పైగా నిందితులను అరెస్ట్ చేసినట్లు ఆయన వెల్లడించారు.

ఈ మేరకు అమిత్ షా సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా వివరాలను వెల్లడించారు. భద్రతా బలగాలు సమన్వయంతో చేపట్టిన ఆపరేషన్ల ద్వారా ఈ నెట్‌వర్క్‌ను ఛిన్నాభిన్నం చేసినట్లు పేర్కొన్నారు. ఉగ్రవాదంపై నరేంద్ర మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న జీరో టాలరెన్స్ విధానానికి ఈ విజయమే నిదర్శనమని ఆయన స్పష్టం చేశారు. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం, ఆగస్టు 12వ తేదీన దేశవ్యాప్తంగా 14 రాష్ట్రాల్లో ఏకకాలంలో దాడులు నిర్వహించారు. ఈ ఆపరేషన్‌లలో మొత్తం 253 మందిని అదుపులోకి తీసుకోగా, 200 మందికి పైగా నిందితులను అధికారికంగా అరెస్ట్ చేశారు. ఈ వ్యవహారంలో ఇప్పటివరకు 80కి పైగా ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. అత్యధికంగా ఉత్తరప్రదేశ్‌లో 62 మంది, హర్యానాలో 52, ఢిల్లీలో 51, పంజాబ్‌లో 44 మందిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుంచి ఐఈడీలు, పాకిస్థాన్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ ముద్రలు కలిగిన గ్రెనేడ్లు, పిస్టళ్లు, మందుగుండు సామాగ్రితో పాటు గూఢచర్యం కోసం వినియోగించే రహస్య కెమెరాలను స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. షాజాద్ భట్టి నెట్‌వర్క్, ప్రధానంగా గ్రెనేడ్, ఐఈడీలు, పెట్రోల్ బాంబు దాడులతో పాటు లక్షిత హత్యలకు కుట్ర పన్నుతున్నట్లు అధికారులు వివరించారు. పోలీసు స్టేషన్లు, రక్షణ సంస్థలు, మతపరమైన ప్రదేశాలపై నిఘా ఉంచేందుకు ఈ ముఠా స్థానికులకు భారీగా నగదు చెల్లించిందని ప్రాథమిక విచారణలో వెల్లడైంది.

## కబ్జాల నుంచి నగరానికి విముక్తి కల్పిద్దాం

- పర్యావరణాన్ని పరిరక్షించుకుదామన్న హైడ్రా కమిషనర్
- హైడ్రాలో ఘనంగా స్వాతంత్ర దినోత్సవ వేడుకలు




**హైదరాబాద్, నవతరం:** చెరువులు, నాలాలు, పార్కులు కాపాడి.. పర్యావరణ పరిరక్షణకు రాజ్యాంగ స్ఫూర్తితో అందరం కలసి పని చేద్దామని హైడ్రా కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్ పిలుపునిచ్చారు. కబ్జాలను నియంత్రించి.. ఆక్రమణలకు ఆస్కారం లేకుండా ప్రభుత్వ శాఖలన్నిటితో సమన్వయంగా కలసి పని చేద్దామన్నారు. హైడ్రా కార్యాలయంలో శనివారం జరిగిన స్వాంత్ర వేడుకల్లో జాతీయ పతాకాన్ని హైడ్రా కమిషనర్ ఎగుర వేశారు. 80వ స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని హైడ్రా కమిషనర్ శ్రీ ఏ.వి. రంగనాథ్ గారు ప్రజలకు, సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజల ఆస్తులను కాపాడడమనేది అందరి లక్ష్యం కావాలని.. ఈ క్రమంలో ఎన్ని అవాంతరాలు వచ్చినా..

ఆటుపోట్లు ఎదురైనా వెనుకడుగు వేయకుండా ఈ కార్యక్రమాన్ని ఓ యజ్ఞంలా కొనసాగిద్దామన్నారు. తెలంగాణ రాష్ట్ర గీతంలో పేర్కొన్న విధంగా సుఖశాంతులతో తెలంగాణను సుభిక్షంగా ఉంచేందుకు ప్రజలందరి సహకారంతో కలసి పని చేద్దామన్నారు. పర్యావరణ హితమైన నగర నిర్మాణమే లక్ష్యంగా పని చేయడానికి సంకల్పం తీసుకుందామన్నారు. గొలుసుకట్టు చెరువులను పునరుద్ధరించి వరదలు లేని నగరాన్ని తీర్చిదిద్దాలనే ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా పని చేద్దామన్నారు. చిత్తశుద్ధితో పని చేసి ప్రజల మన్ననలు పొందడమే కాకుండా.. వారితో శభాష్ అనిపించుకుందామని హైడ్రా కమిషనర్ ఈ సందర్భంగా ఉద్యోగులకు సూచించారు.

## బీజేపీ కొత్త టీమ్‌లో ఏపీకి 3 కీలక పదవులు



**న్యూ ఢిల్లీ, నవతరం:** బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ కొత్త జాతీయ కార్యవర్గాన్ని ప్రకటించారు. ఇందులో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ముగ్గురికి కీలక బాధ్యతలు దక్కాయి. డి. పురందేశ్వరి, రామ్ మాధవ్‌కు జాతీయ ఉపాధ్యక్ష పదవులు వరించాయి. విష్ణువర్ధన్ రెడ్డికి జాయింట్ కో-ఆర్డినేటర్ బాధ్యతలు అప్పగించారు. అదే సమయంలో తెలంగాణ నుంచి ఒక్కరికి కూడా జాతీయ టీమ్‌లో చోటు దక్కకపోవడం చర్చనీయాంశంగా మారింది.

### • తెలంగాణకు నో ప్లేస్!

కొత్త కార్యవర్గంలో కేరళ, పశ్చిమ బెంగాల్, ఒడిశా, ఈశాన్య రాష్ట్రాలకు చెందిన నేతలకు ప్రాధాన్యం ఇచ్చారు. రాజస్థాన్ మాజీ సీఎం వసుంధర రాజే, ఒడిశాకు చెందిన బైజయంత్ పాండా, ఉత్తరప్రదేశ్‌కు చెందిన రేఖా వర్మ, తారిఖ్ మన్సూర్ జాతీయ ఉపాధ్యక్షులుగా కొనసాగనున్నారు. ఉత్తరాఖండ్ మాజీ సీఎం తీరత్ సింగ్ రావత్, పంజాబ్‌కు చెందిన మన్‌ప్రీత్ సింగ్ బాదల్ సహా పలువురికి ఇదే బాధ్యతలు అప్పగించారు. 13 మంది జాతీయ ఉపాధ్యక్షుల్లో మహిళలకు గణనీయమైన ప్రాతినిధ్యం కల్పించారు.

మాజీ కేంద్ర మంత్రి స్మృతి ఇరానీకి జాతీయ ప్రధాన కార్యదర్శి పదవి దక్కింది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఓటమి తర్వాత ఆమెకు లభించిన తొలి కీలక సంస్థాగత బాధ్యత ఇదే. వినోద్ తావ్‌డే, సునీల్ బన్సల్, బిప్లవ్ కుమార్ దేవ్ సహా పలువురు ప్రధాన కార్యదర్శులుగా కొనసాగనున్నారు. వసుంధర రాజే, స్మృతి ఇరానీ మళ్లీ కీలక సంస్థాగత పదవుల్లోకి మిగతా 4లో..

## 8 లక్షల డ్రైవర్లు.. 41 లక్షల కస్టమర్లు

### 'భారత్ ట్యాక్సీ' సంచలనం!

- భారత్ ట్యాక్సీలో 8 లక్షల మంది డ్రైవర్లు
- కస్టమర్ల సంఖ్య 41 లక్షలకు
- 2029 నాటికి దేశవ్యాప్త విస్తరణ లక్ష్యం
- జీరో కమిషన్ విధానంలో డ్రైవర్లకు ప్రయోజనం
- త్వరలో మరో ఏడు నగరాల్లో సేవలు




దేశంలో క్యాబ్ సేవల రంగంలో కొత్త వేదిక వేగంగా విస్తరిస్తోంది. సహకార సంస్థల ఆధారంగా పనిచేస్తున్న 'భారత్ ట్యాక్సీ'కి భారీ స్పందన లభిస్తోంది. జులై 25 నాటికి ఈ ప్లాట్‌ఫామ్‌లో దాదాపు 8 లక్షల మంది డ్రైవర్లు చేరారు. కస్టమర్ల సంఖ్య 41 లక్షలకు చేరింది. 2029 నాటికి దేశవ్యాప్తంగా సేవలు అందించడమే లక్ష్యంగా భారత్ ట్యాక్సీ ముందుకు సాగుతోంది.

మల్టీ-స్టేట్ కోఆపరేటివ్ సొసైటీస్ యాక్ట్-2002 కింద భారత్ ట్యాక్సీ ఏర్పాటైంది. నాబార్డ్, ఇఫ్కో, అమూల్, నాఫెడ్, నేషనల్ కోఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సహా ఎనిమిది జాతీయ సహకార సంస్థలు దీన్ని ఏర్పాటు చేశాయి. ప్రస్తుతం ఢిల్లీ-ఎన్‌సీఆర్, గుజరాత్, ముంబయి, లఖ్‌నవూ, చండీగఢ్, జైపూర్, కాన్పూర్, పుణేలో సేవలు అందిస్తోంది.

త్వరలో మరిన్ని నగరాలకు భారత్ ట్యాక్సీ విస్తరించనుంది. రాంచీ, పాట్నా, గువాహటి, భోపాల్, కోల్‌కతా, ఇండోర్, నాగ్‌పూర్‌లో సేవలు ప్రారంభించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. దశలవారీగా దేశవ్యాప్తంగా కార్యకలాపాలను విస్తరించాలని సంస్థ లక్ష్యంగా పెట్టుకుంది.
భారత్ ట్యాక్సీ ప్రత్యేకత జీరో కమిషన్ విధానం. డ్రైవర్లను 'సారథులు'గా పిలుస్తున్నారు. ప్రయాణికుల నుంచి వచ్చిన చార్జీలో ప్లాట్‌ఫామ్‌కు కమిషన్ చెల్లించాల్సిన అవసరం లేకపోవడంతో డ్రైవర్లు తమ ఆదాయాన్ని పూర్తిగా పొందే అవకాశం ఉంటుంది. సారథులు సహకార సంస్థలో వాటాలు కొనుగోలు చేసి సభ్య యజమానులుగా మారొచ్చు. సంస్థ నిర్వహణలోనూ వారికి ప్రాతినిధ్యం ఉంటుంది. మిగతా 4లో..

## వైసీపీ నేత చింతాడ రవికుమార్ కు బెయిల్

- **మహిళా ఎస్సై పట్ల అనుచితంగా ప్రవర్తించిన కేసు**
- **చింతాడతో పాటు ఇతర నేతలకు బెయిల్ ఇచ్చిన ఆమదాలవలస కోర్టు**
- **బెయిల్ రావడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తున్న వైసీపీ శ్రేణులు**



**ఆమదాలవలస, నవతరం:** మహిళా ఎస్సై పట్ల అనుచితంగా ప్రవర్తించారనే ఆరోపణలతో నమోదైన కేసులో అరెస్టై రిమాండ్‌లో ఉన్న వైసీపీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్‌కు కోర్టులో భారీ ఊరట లభించింది. ఆమదాలవలస కోర్టు చింతాడ రవికుమార్‌తో పాటు ఈ కేసులో నిందితులుగా ఉన్న ఇతరులకు కూడా బెయిల్ మంజూరు చేసింది. దీంతో వీరంతా జైలు నుంచి విడుదలయ్యారు. చింతాడకు బెయిల్ రావడం పట్ల వైసీపీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

## రేవంత్ ఇల్లు కూడా నిషేధిత జాబితాలో ఉంది

- జాబితా నుంచి సీఎం ఇంటిని తొలగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపణ
- నిషేధిత ఆస్తుల జాబితాపై విచారణ జరిపి శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్
- సామాన్యుల పరిస్థితి ఏమిటన్న హరీశ్ రావు



**హైదరాబాద్, నవతరం:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాసం కూడా నిషేధిత ఆస్తుల జాబితాలో ఉందని, దానిని ఆ జాబితా నుంచి తొలగించేందుకు ప్రభుత్వం తెరవెనుక ప్రయత్నాలు చేస్తోందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు సంచలన ఆరోపణలు చేశారు. ఈ అంశంపై సమగ్ర విచారణ జరిపి, తక్షణమే శ్వేతపత్రం విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

సోమవారం హరీశ్ రావు మీడియాతో మాట్లాడుతూ, "ముఖ్యమంత్రి నివాసానికే ఈ పరిస్థితి ఎదురైతే, ఇక సామాన్య ప్రజల గతి ఏమిటి?" అని ప్రశ్నించారు. అసలు ఏ ప్రాతిపదికన ఆస్తులను నిషేధిత జాబితాలో చేర్చారో విచారణ జరపాలని, ఆ జాబితాలో ఉన్న ఆస్తులు పూర్తి వివరాలను బహిర్గతం చేయాలని కోరారు. ఈ సమస్య పరిష్కారానికి ప్రభుత్వం స్పష్టమైన కాలపరిమితిని ప్రకటించాలని డిమాండ్ చేశారు. నిషేధిత జాబితాకు సంబంధించి సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు చేసినప్పటికీ, ప్రభుత్వం నుంచి ఎటువంటి సమాధానం రావడం లేదని ఆయన విమర్శించారు.

ప్రగతి నగర్ లోని కెజిఆర్ కన్వెన్షన్ లో వివాహ శుభాకార్యానికి హాజరైన తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ను మర్యాదపూర్వకంగా కలిసి నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి
- (నవతరం, కుత్బుల్లాపూర్)







## "ఏఆర్ బేవరేజెస్" ప్రారంభించిన ఎమ్మెల్యే వివేక్







**కుత్బుల్లాపూర్, నవతరం:** 129 - సూరారం డివిజన్ సూరారం విలేజ్ లో కుమ్మరి చందు ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన "ఏఆర్.బేవరేజెస్" ను బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.... నేటితరం యువత ఉద్యోగ అన్వేషకై కాకుండా స్వయం ఉపాధి వైపు అడుగులు వేస్తూ వ్యాపారాలు ప్రారంభించడం మంచి పరిణామమన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కొండకల్ల శ్రీనివాస్ రెడ్డి, వారాల వినోద్, యాదిరెడ్డి, అమృత, కోల శ్రీకాంత్, సురేష్, నర్సింహా, సాయి, తదితరులు పాల్గొన్నారు.

## 92 లక్షల మందికి నోటీసులు!

### తెలంగాణలో 'సర్' ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల

తెలంగాణలో ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (సర్) ప్రక్రియలో భాగంగా ముసాయిదా ఓటర్ల జాబితా విడుదలైంది. రాష్ట్ర ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి సోమవారం వివరాలు వెల్లడించారు. సర్‌కు ముందు రాష్ట్రంలో 3,38,26,448 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. గడువులోగా ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పించిన 2,64,87,214 మంది పేర్లతో ముసాయిదా జాబితా రూపొందించినట్లు చెప్పారు.



మొత్తం ఓటర్లలో 78.03 శాతం మంది పేర్లు ముసాయిదా జాబితాలో ఉన్నాయని సుదర్శన్ రెడ్డి తెలిపారు. మరోవైపు 73 లక్షల మంది ఓటర్లు ఏఎస్‌బీ (అబ్సెంట్, షిఫ్టెడ్, డూప్లికేట్) జాబితాలో ఉన్నట్లు చెప్పారు.

అన్‌మ్యాప్డ్ జాబితాలో ఉన్న 92 లక్షల మందికి నోటీసులు జారీ చేయనున్నట్లు వెల్లడించారు. నోటీసులు అందుకున్నవారు తమ వివరాలపై వివరణ ఇచ్చేందుకు సెప్టెంబర్ 16 వరకు గడువు ఉంటుందని తెలిపారు. ఈ నోటీసులను బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు) పోస్టు ద్వారా పంపించనున్నట్లు చెప్పారు. తమ పేరు జాబితాలో లేకపోయినా అర్హత ఉన్నవారు ఫారం 6ఏ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని స్పష్టం చేశారు.

## బొత్సకు అచ్చెన్నాయుడు కౌంటర్

- డీఎస్సీపై మాట్లాడే నైతిక హక్కు వైసీపీకి లేదన్న అచ్చెన్నాయుడు
- మెగా డీఎస్సీ-2025లో అవకతవకలపై సీబీఐ విచారణకు విపక్షం డిమాండ్
- విద్యాశాఖ మంత్రిగా బొత్స విఫలమయ్యారంటూ అచ్చెన్న విమర్శలు
- అచ్చెన్న వ్యాఖ్యలపై దుమారం, క్షమాపణ చెప్పాలని విపక్షం పట్టు
- గందరగోళం మధ్య శాసనమండలి రెండు సార్లు వాయిదా



ఏపీ, నవతరం: గత ఐదేళ్ల పాలనలో నిరుద్యోగులకు 'మెగా డీఎస్సీ' ఇస్తామని ఆశలు రేపి, చివరికి ఒక్క నోటిఫికేషన్ కూడా ఇవ్వకుండా మోసం చేసిన వైసీపీకి ఇప్పుడు డీఎస్సీ నియామకాల గురించి మాట్లాడే నైతిక హక్కు లేదని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గత ప్రభుత్వంలో విద్యాశాఖ మంత్రిగా పనిచేసిన బొత్స సత్యనారాయణ, నిరుద్యోగుల భవిష్యత్తుతో ఆడుకుని ఇప్పుడు మండలిలో డీఎస్సీపై నీతులు చెప్పడం సిగ్గుచేటని ఆయన ఘాటుగా విమర్శించారు. సోమవారం మిగతా 4లో..

## నిజాలు బయటకు రావాలంటే సీబీఐ విచారణ ఒక్కటే సరైన మార్గం

- డీఎస్సీ అంశంపై శాసనమండలిలో వైసీపీ రచ్చ
- నారా లోకేశ్ తక్షణమే రాజీనామా చేయాలన్న బొత్స సత్యనారాయణ
- నిరుద్యోగులను ప్రభుత్వం మోసం చేసిందని మండిపాటు



ఆంధ్రప్రదేశ్ శాసనమండలి సమావేశాలు మెగా డీఎస్సీ వివాదంతో తీవ్ర ఉద్రిక్తతల మధ్య ప్రారంభమయ్యాయి. కూటమి ప్రభుత్వం చేపట్టిన టీచర్ నియామకాల ప్రక్రియలో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయంటూ ప్రతిపక్ష వైసీపీ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తింది. దీనిపై సభలో సమగ్ర చర్చ జరగాలని, బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తక్షణమే రాజీనామా చేయాలని శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ డిమాండ్ చేశారు. నియామకాల్లో చోటుచేసుకున్న అవకతవకలు, స్పోర్ట్స్ కోటా కేటాయింపుల్లో అవకతవకల్లో నిజాలు బయటకు రావాలంటే సీబీఐ విచారణ ఒక్కటే సరియైన మార్గమని ఆయన స్పష్టం చేశారు.

శాసనమండలిలో వైసీపీ ఇచ్చిన వాయిదా తీర్మానాన్ని చైర్మన్ తిరస్కరించడంతో సభలో ఒక్కసారిగా కలకలం రేగింది. కూటమి ప్రభుత్వం 'మెగా డీఎస్సీ' పేరుతో నిరుద్యోగులను 'దగా డీఎస్సీ'గా మోసం చేసిందని విపక్ష సభ్యులు నినాదాలతో హోరెత్తించారు. పరీక్షలు రాయని వారికి కూడా ఉద్యోగాలు ఇచ్చారనే ఆరోపణలు ఉన్నాయని, ఉద్యోగాల బేరసారాలకు సంబంధించిన ఆడియో టేపులు బయటకు వచ్చినా ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం వెనుక మర్మమేంటని బొత్స ప్రశ్నించారు. ప్రతిపక్షం లేవనెత్తిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేక ప్రభుత్వం చర్చ నుంచి పారిపోతోందని విమర్శించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన గ్రూప్-1 నియామకాలపై అధికార పక్షం చేస్తున్న ఆరోపణలనూ మిగతా4 లో

# రెడ్ బుక్ రాజ్యాంగాన్ని ప్రజలే తిప్పికొడతారు

- ఓటుకు రేటు కట్టి ఇప్పుడు అవమానమా?
- క్షమాపణ చెప్పేదాకా పోరాటం ఆగదు
- మహిళల ఆత్మగౌరవంపై దాడి ఆపండి
- సుజాత పండా



**పలాస, నవతరం:** కూటమి ప్రభుత్వం అధికార మదంతో మహిళల ఆత్మగౌరవాన్ని కాలరాస్తోందని వైఎస్ఆర్సీపీ పలాస నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలు సుజాత పండా ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం పలాసలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎన్నికల ముందు ఇంటింటికి తిరిగి అక్కా చెల్లెమ్మా అంటూ చేతులు జోడించి ఓట్లు అడిగిన వారే, ఇప్పుడు అధికారంలోకి వచ్చాక అదే మహిళలను కించపరిచేలా మాట్లాడడం దారుణమని అన్నారు. ఓటుకు రూ.2 వేలు ఇచ్చామని, ఆ డబ్బు తీసుకున్నారని బహిరంగ వేదికలపై ప్రస్తావించడం మహిళా లోకాన్ని అవమానించడమేనని ఆమె మండిపడ్డారు. “ఇచ్చిన వాడు కోట్లు సంపాదించుకోవాలనుకున్నాడు కాబట్టే డబ్బు ఇచ్చాడు. అది పెట్టుబడి అనుకున్నాడు. మరి ఇప్పుడు ఆ పెట్టుబడికి లాభాలు రాకపోతే మహిళలపై ఎందుకు నిందలు?” అని ఆమె నిలదీశారు. భోజనానికి పిలిచి గౌరవించాల్సింది పోయి, వేదికలపై నిలబడి మహిళల పరువు తీయడం సిగ్గుచేటని అన్నారు. అధికారంలో ఉన్నవారు మాట్లాడే ప్రతి మాటకు బాధ్యత ఉండాలని, లేకుంటే ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. గత ప్రభుత్వ హయాంలో అమ్మ ఒడి, వైఎస్ఆర్ ఆసరా, చేయూత, కాపు నేస్తం లాంటి పథకాల ద్వారా కోట్లాది మంది మహిళలకు నేరుగా ఆర్థిక సహాయం అందించామని గుర్తు చేశారు.

మహిళలకు 50 శాతం స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు ఇచ్చి గౌరవించామని చెప్పారు. కానీ కూటమి ప్రభుత్వం రెండేళ్లలో ఇచ్చిన ఒక్క హామీని కూడా నెరవేర్చలేదని ఆరోపించారు. సూపర్ సిక్స్ పేరుతో పెద్ద పెద్ద వాగ్దానాలు చేసి, అమలులో మాత్రం పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. పలాసలో మా నాయకుడు రాష్ట్ర మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజును రోడ్డు ప్రమాదం కేసును మర్డర్ కేసుగా చిత్రీకరించి జైలుకు పంపించినా వైఎస్ఆర్సీపీ శ్రేణుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయలేకపోయారని ఆమె అన్నారు. చెక్కుచెదరని అభిమానంతో డాక్టర్ అప్పలరాజుకు సంఘీభావం తెలుపుతూ పార్టీ నిరసన కార్యక్రమాలు నిర్వహించడమే కాక, తమ సత్తా ఏమిటో నిరూపించుకున్నామని ఆమె స్పష్టం చేశారు. “ఇది ఒక్క మహిళల సమస్య మాత్రమే కాదు. ఇది ఆంధ్రప్రదేశ్ మహిళా లోకానికి జరిగిన అవమానం” అని సుజాత పండా అన్నారు. ప్రతి ఇంటి ఆడబిడ్డ గుండెల్లో ఈ మాటలు గాయంలా నిలిచిపోయాయని చెప్పారు. వంటింటి నుంచి వేదికల వరకు ప్రతి మహిళ ఈ అవమానాన్ని తీవ్రంగా ఖండిస్తోందని అన్నారు. ప్రశ్నిస్తే అక్రమ కేసులు పెట్టి, జైళ్లకు పంపిస్తామని బెదిరించే సంస్కృతిని తాము సహించబోమని ఆమె అన్నారు.

భవిష్యత్తులో కూడా రెడ్ బుక్ రాజ్యాంగానికి వ్యతిరేకంగా ప్రభుత్వ దుశ్చర్యలను ఎండగడుతూ ప్రజల తరపున పోరాటం చేస్తామని తెలిపారు. వెంటనే బాధ్యతాయుతమైన స్థానంలో ఉన్నవారు బహిరంగంగా మహిళలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. “క్షమాపణ చెప్పేంత వరకు మా పోరాటం ఆగదు. ఇది హెచ్చరిక. మా గొంతు నొక్కాలని చూస్తే మరో పది గొంతులు లేస్తాయి. మహిళల కోసం చివరి వరకు పోరాడతాం. దీటుగా సమాధానం చెబుతాం” అంటూ ఆమె పంచ్ డైలాగ్ తో ముగించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సీపీ పలాస నియోజకవర్గ మహిళా విభాగ నాయకురాళ్లు, సీనియర్ కార్యకర్తలు, వివిధ గ్రామాల నుంచి వచ్చిన మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వ తీరును ఖండిస్తూ నినాదాలు చేశారు.

# ఆవు పొలం మేస్తే... దూడ గట్టు మేస్తుందా?

- ప్రభుత్వ పరిహారంలో రెండు నాలుకల ధోరణి!
- ఒకరికి 10 లక్షలు... మరొకరికి సున్నా



పలాస, నవతరం: ప్రమాదాల్లో నష్ట పరిహారం పంపిణీలో రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన ద్వంద్వ నీతి అవలంబిస్తోందని వైఎస్ఆర్సీపీ జిల్లా అధికార ప్రతినిధి బమ్మిడి దుర్యోధనరావు సోమవారం పలాసలో మీడియాతో మాట్లాడుతూ తీవ్రంగా విమర్శించారు. "ఆవు పొలం మేస్తే దూడ గట్టు మేస్తుందా" అన్న సామెతను ఉదహరిస్తూ అధికార పార్టీకి చెందిన వారికైతే లక్షల్లో పరిహారం ప్రకటించి, సామాన్య బాధితులను మాత్రం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ప్రజాస్వామ్యంలో అన్ని రాజకీయ పార్టీలకు, అన్ని వర్గాల ప్రజలకు సమాన న్యాయం ఉండాల్సిన అవసరం ఉందని, కానీ ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం కక్షపూరిత రాజకీయాలతో ప్రజలను విభజిస్తోందని అన్నారు. ముఖ్యంగా పలాస నియోజకవర్గంలో జరుగుతున్న రాజకీయాలు పూర్తిగా అప్రజాస్వామికం, అనైతికం, కుట్రతో కూడుకున్నవని, ఇలాంటి ధోరణులను మేధావులు, ప్రజాస్వామ్యవాదులు, మానవతావాదులు అందరూ ఏకతాటిపైకి వచ్చి ఖండించాల్సిన సమయం ఆసన్నమైందని పిలుపునిచ్చారు.

గతంలో వైఎస్ఆర్సీపీ ప్రభుత్వ హయాంలో పల్నాడు శ్రీనివాసరావు కుటుంబానికి ప్రమాదంలో మరణించినందున 10 లక్షల రూపాయల ఆర్థిక సహాయాన్ని ఎలాంటి కోతలు లేకుండా నేరుగా బాధిత కుటుంబానికి అందించామని దుర్యోధనరావు గుర్తు చేశారు. అదే స్ఫూర్తితో అప్పట్లో అనేక ప్రమాద బాధిత కుటుంబాలకు తక్షణ సహాయం అందించామని తెలిపారు. కానీ ఇప్పుడు అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం దానయ్య కుటుంబానికి 10 లక్షలు ప్రకటించి అందులో వివిధ పేర్లతో లెక్కలు సర్దుబాట్లు చేసి ఇస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో జరిగే ప్రతి ప్రమాదానికి, ప్రతి మరణానికి ఒకే రకమైన ప్రమాణాలు ఉండాలని, లేకపోతే ప్రభుత్వం బాధితులను రాజకీయ కోణంలో చూస్తోందనే అర్థమని అన్నారు. కవిటి మండలంలో ఇటీవల జరిగిన లారీ ప్రమాదంలో దుర్మరణం పాలైన నర్సు వెంకటరమణ కుటుంబం, పిడుగుపాటుకు గురై ప్రాణాలు కోల్పోయిన పాతశాల, పెందోర్తి గ్రామాలకు చెందిన గిరిజన మహిళల కుటుంబాలు నేటికీ ప్రభుత్వ సహాయం కోసం ఎదురుచూస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ బాధిత కుటుంబాలకు ఇప్పటివరకు ఎలాంటి ఆర్థిక సహాయం ప్రకటించలేదని, వారి ఆవేదనను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు.

ఈ సందర్భంగా వైఎస్ఆర్సీపీ రాష్ట్ర నాయకులు, రాష్ట్ర మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజ విషయంలో రోడ్డు ప్రమాదాన్ని మర్డర్ కేసుగా చిత్రీకరించి, అక్రమంగా కేసు బనాయి జైలు పాలు చేసిన తీరును ప్రజలు గమనించారని దుర్యోధనరావు అన్నారు. ఎట్టకేలకు న్యాయస్థానంలో న్యాయం జరిగి, బెయిల్ మంజూరు కావడంతో ఆయన జైలు నుంచి విడుదల కావడం వైఎస్ఆర్సీపీ శ్రేణులకు ఊరట ఇచ్చిన అంశమని పేర్కొన్నారు. న్యాయ వ్యవస్థపై నమ్మకం ఉన్నందునే నిజం నిలబడిందని, ఇలాంటి కక్షపూరిత చర్యలు ప్రజాస్వామ్యానికి చేటు తెస్తాయని హెచ్చరించారు.

ప్రస్తుతం అధికారంలో ఉన్న పార్టీ జాతీయ పార్టీ అని చెప్పుకుంటున్నప్పుడు వారికి ఒక స్పష్టమైన విధానం ఉండాలని, అధికారంలోకి వచ్చిన రెండు ఏళ్ల కాలంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రమాదాల్లో చనిపోయిన వారిలో ఎంతమందికి 10 లక్షల రూపాయలు ఇచ్చారో శ్వేతపత్రం విడుదల చేయాలని సవాల్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ముఖ్యంగా పలాస నియోజకవర్గంలో గత కొంతకాలంగా కొనసాగుతున్న కక్ష, కుట్ర రాజకీయాలు ప్రజాస్వామ్యానికి మాయని మచ్చ అని, అధికార అండతో ప్రతిపక్ష నాయకులను, కార్యకర్తలను వేధించడం, బాధితులకు సహాయం అందించడంలో కూడా రాజకీయ రంగు పులమడం సరికాదని పేర్కొన్నారు. ఇలాంటి అప్రజాస్వామిక చర్యలను అన్ని ప్రజాస్వామిక పార్టీలు, ప్రజా సంఘాలు కలిసి ఖండించాలని కోరారు. వైఎస్ఆర్సీపీ పార్టీ పుట్టినప్పటి నుంచి బాధితుల పక్షానే ఉందని, గతంలో దానయ్యతో పాటు రాష్ట్రంలోని అనేక మంది బాధితులకు ఆర్థిక, నైతిక సహాయం అందించామని, ఇప్పుడు కూడా అదే స్ఫూర్తితో ప్రజలకు అండగా నిలుస్తామని, అవసరమైతే ఆందోళనలు చేసి అయినా ప్రతి బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా పోరాడతామని స్పష్టం చేశారు.

# సంక్షేమ పథకాలు అందించలేని అసమర్ధ ప్రభుత్వం

## కాంగ్రెస్ ప్రభుత్వంపై మండిపడ్డ బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్

**కుత్బుల్లాపూర్, నవతరం:** కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలపై హైకోర్టు స్టే విధిస్తూ ప్రభుత్వాన్ని కౌంటర్ దాఖలు చేయాలని సూచించిన ప్రభుత్వం తమ నిర్లక్ష్య వైఖరితోకౌంటర్ దాఖలు చేయకుండా సంక్షేమ పథకాలకు స్వస్తి పలికేలా ప్రభుత్వం వ్యవహరిస్తున్న నిర్లక్ష్య ధోరణిని నిరసిస్తూ బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపుమేరకు ఈరోజ కుత్బుల్లాపూర్ జోనల్ కార్యాలయం ముందు టిఆర్ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమం నిర్వహించగా ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణిని మీడియా ముఖంగా ఎండగట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... రేవంత్ రెడ్డి పీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు వందరోజుల్లో ఆరు గ్యారెంటీలు, 12 డిక్లరేషన్లు, 420 హామీలతోఅబద్ధపు హామీలతో ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చారు. ఇచ్చిన హామీలను అమలు చేయలేకచతికిల పడ్డ దద్దమ్మ ప్రభుత్వం ఈ కాంగ్రెస్ ప్రభుత్వం, కెసిఆర్ సర్వజనహితం కోసం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను, అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగించడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది, మేం అధికారంలోకి వస్తేకళ్యాణ లక్ష్మి తో పాటు తులం బంగారం ఇస్తామని అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి నీ తులం బంగారం ఏమైంది, ఎక్కడికి పోయింది, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్పథకాలపై కోర్టు స్టే విధిస్తే ప్రభుత్వం పక్షాన కౌంటర్ దాఖలు చేసి పోరాటం చేయలేని అసమర్ధ ప్రభుత్వం ఈ రేవంత్ రెడ్డి ప్రభుత్వం అన్నారు. కొత్త పెన్షన్లకు ఇప్పటికే పదుల సార్లు దరఖాస్తులు తీసుకొని ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తుంది. 19 దరఖాస్తులు వస్తేఒకపెన్షన్ కూడా మంజూరు చేయలేని అసమర్థ ప్రభుత్వం ఈ కాంగ్రెస్ ప్రభుత్వం, దీనికి తోడుమళ్లీ దరఖాస్తులు పెట్టమని ప్రజలను వేధిస్తున్నారు. ఆడపిల్ల పుడితే కెసిఆర్ కిట్ తో పాటుగా 13 వేల రూపాయలను కెసిఆర్ అందించినారు. ఈ పథకాన్ని కూడా కొనసాగించలేని అసమర్థ ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం, రైతాంగం తో పాటు మహిళలను, ఉద్యోగులను, నిరుద్యోగులను, విద్యార్థులతో పాటు అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిన ఈ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దించాల్సినసమయం ఆసన్నమైంది. 24 గంటల విద్యుత్ తో అటు రైతాంగాన్ని, ఇటు పారిశ్రామిక రంగాన్ని, మరో ప్రక్క గృహ వినియోగదారులకు విద్యుత్ ను అందించిన ఘనత కెసిఆర్ గారిది అయితే నాణ్యమైన విద్యుత్ అందించలేని స్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉంది. రాష్ట్ర ప్రజల గొంతు ఎండుతుంటే, త్రాగునీటిని కూడా అందించలేని అసమర్థ ప్రభుత్వం ఈ కాంగ్రెస్ ప్రభుత్వం. రేవంత్ రెడ్డి ఈఎంఐ ముఖ్యమంత్రి, నెల నెల ఢిల్లీకి వెళ్లాలి డబ్బుల మూటలు అప్పజెప్పాలి, అప్పుడే ఆ పోస్ట్ ఉంటుంది. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ప్రజలు విసుగు చెందారు, ప్రజలు సరైన సమయం కోసం ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం వెంటనే కౌంటర్ దాఖలు చేసి సంక్షేమ పథకాలను కొనసాగించాలి, లేదంటే వారికి ప్రజలే రానున్న రోజుల్లో గుణపాఠం చెబుతారన్నారు. సంక్షేమ పథకాలను, అభివృద్ధి కార్యక్రమాలను గాలికి వదిలేసి డబ్బులు వసూళ్లకే అధిక ప్రాధాన్యతనిస్తూ గల్లీ లీడర్ నుంచి ఢిల్లీ లీడర్ వరకు అందరూ వసూళ్లకే పాల్పడుతూ దోచుకోవడం, దాచుకోవడం అనే రీతిలో రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన కొనసాగుతుంది. కెసిఆర్ తెలంగాణను బంగారు తెలంగాణగా మారిస్తే, ఈ కాంగ్రెస్ నాయకులు కుక్కలు చింపిన విస్తరాకులుగా మార్చారు. వ్యాపారులు, బిల్డర్లు, రైతులు ఇబ్బందులు పడతా ఉన్నారు. ప్రజా సమస్యలపై బాధ్యత గల ప్రతిపక్ష పార్టీగా బీఆర్ఎస్ పోరాడితే పాలన చేతకాక పెద్దలు కేసీఆర్ గారిపై, కేటీఆర్ గారి పై దుమ్మెత్తి పోస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం పబ్బం గడుపుకుంటుంది. ప్రజా సంక్షేమ పథకాల కొనసాగింపులో ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని వదిలి ప్రజలకు సంక్షేమ పథకాలను అందించాలి, లేదంటే ప్రజల పక్షాన పోరాడేందుకుబి ఆర్ ఎస్ పార్టీ ఎప్పుడు సిద్ధంగా ఉంటుందన్నారు.









# భౌరంపేట్ బంగారు మైసమ్మ తల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

కుత్బుల్లాపూర్, నవతరం: సిఎంసి దుండిగల్ సర్కిల్ పరిధి భౌరంపేట్‌లోని శ్రీశ్రీశ్రీ బంగారు మైసమ్మ తల్లి బోనాల పండుగను పురస్కరించుకుని నిర్వహించిన పూజా కార్యక్రమానికి బీఆర్ఎస్ ఎల్పీ విప్,ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ ముఖ్య అతిథిగా విచ్చేసి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వివేక్ మాట్లాడుతూ....అ మ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, ప్రజలు



సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఎమ్మెల్యే ప్రార్థించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే ను శాలువాతో ఘనంగా సన్మానించారు ఆలయ కమిటీ సభ్యులు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు, భక్తులు, పాల్గొన్నారు.









## పరికి చెరువు భూములు మాయం చేస్తున్న ముఠా...!

# అంతా అడుగు నాశనం

- ప్రభుత్వ భూములు, నాళాలు, చెరువులు మాయం
- అందినకాడికి దండుకుంటున్న కేటుగాళ్లు
- జగద్గిరిగుట్ట పరికిచెరువు భవిష్యత్ తరాలకు మిగిలేనా..?
- ఓ వైపు భూదేవి హిల్స్, మరోవైపు మహదేవపురం..!
- పరికి చెరువు ఎఫ్టీఎల్, బఫర్ జోన్ లు మాయం
- చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్న ఇరిగేషన్ శాఖ
- హైడ్రా అధికారులు కల్పించుకోవాలంటున్న స్థానికులు








**గాజులరామారం, నవతరం:** మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్ మండల పరిధిలోని గాజులరామారం గ్రామం 'పరికి చెరువు' కు సంబంధించి కొన్ని ఎకరాల ప్రభుత్వ భూములు మాయమవుతున్నాయి. స్థానికంగా ఇంత జరుగుతున్నా.. ఏ ఒక్క కార్పొరేటర్ (జగద్గిరిగుట్ట & గాజులరామారం) స్పందించి చెరువు భూములు, ప్రభుత్వ భూములు కాపాడిన దాఖలాలు లేవు. ఇదే అదనుగా భావించిన కొందరు భూకబ్జాదారులు పరికి చెరువు ఎఫ్టీఎల్ & బఫర్ జోన్ భూములు ఆక్రమించి, తప్పుడు రిజిస్ట్రేషన్లు చేసి కొన్ని కోట్ల రూపాయలు దండుకున్నారు. అందులో భాగంగానే.. తక్కువ ధరకు భూములు రిజిస్ట్రేషన్లు అవుతున్నాయని తెలుసకున్న కొందరు కేటుగాళ్లు చారానా, బారానాకు కొనుక్కుని.. ప్రస్తుతం కొన్ని లక్షల రూపాయలు దండుకోవాలనే ఆకోచనలో ఉన్నారు. ప్రధానంగా, కిష్టారెడ్డి అనే వ్యక్తి.. తనకేమీ తెలియదన్నట్టు, ఈ రోజు హైదరాబాద్ కు వచ్చి స్థిరపడ్డట్టు, దగ్గరి బంధువులే మోసం చేశారన్నట్టు ముచ్చట్లు చెబుతూ.. కొన్ని కోట్ల రూపాయల రూపాయల విలువ చేసే పరికి చెరువు భూములను మాయం చేసే పనిలో నిమగ్నమయ్యాడు, అందుకు తన తమ్ముడు గుంట నక్క వేషాలు వేస్తూ.. మరో నాలుగు వందల గజాల చెరువు శిఖం భూములకు స్కెచ్ వేసినట్టు సమాచారం. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 'హైడ్రా' లాంటి వ్యవస్థను తీసుకువచ్చి చెరువులు, కుంటలు, ప్రభత్వ భూములను కాపాడుతామని చెబుతున్నా.. ఒక్కో గజం ప్రభుత్వ భూమి (ఎఫ్టీఎల్) రెండు లక్షల రూపాయలు అమ్మకానికి పెట్టారంటే అతిషయోక్తి కాదు. కుత్బుల్లాపూర్ మండల పరిధిలో ఉన్న పరికి చెరువు భూములను కాపాడి తరువాతి తరాలకు అందించాల్సిన భాద్యత కేవలం రేవంత్ రెడ్డి








పరికి చెరువునాక్రమించి కిష్టారెడ్డి నిర్మించుకున్న ఇటుకల సామ్రాజ్యం

సర్కార్ కే కాకుండా ప్రతి ఒక్క పౌరుడికి ఉంది. అందుకు సంబంధించి స్థానిక పరికి చెరువుకు సంబంధించిన ఆక్రమణలపై హైడ్రా కమిషనర్ స్పందించి గత పది సంవత్సరాలుగా చెరువులు, కుంటలు ఆక్రమిస్తున్న కిష్టారెడ్డి లాంటి వ్యక్తులను కఠినంగా శిక్షించి, భవిష్యత్ తరాలకు పాటుపాడాలని స్థానిక ప్రజలు కోరుకుంటున్నారు. లేదంటే, అందినకాడికి దోచుకుని, అడుగు నాశనం చేసి తమకేమీ తెలియదని జబ్బలు చర్చుకుంటున్నారు ఇలాంటి ఆర్థిక నేరగాళ్లు. ఓ వైపు అసదుద్దీన్ ఓవైసీ లాంటి 'ఫాతిమా' కాలేజీ లనే తొలగించాలని డిమాండ్ చేస్తున్న యువత ఇలాంటి సహజ వనరులను దోచుకుంటున్న వెంచర్ నిర్వాహకులను, అందులో చారణా, బారానా కు కొనుక్కున్నామంటూ పబ్బం గడుపుకుంటున్న దొంగ ఎధవలను వదిలిపెడుతుందా అంటూ స్థానిక ప్రజలు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. జగద్గిరిగుట్ట, గాజులరామారం సరిహద్దులో ఉన్న పరికి చెరువు ఇప్పటికే కొందరు బడాబాబుల చేతిలో పడి సగానికి పైగా అన్యాక్రాంతమైంది. కాసుల కక్కుర్తిలో ఉన్న అప్పటి రెవెన్యూ, ఇరిగేషన్ శాఖ దొంగల చేతిలో బలై పోయిన పరికి చెరువును కాపాడటానికి ఇప్పటికైనా 'హైడ్రా' అధికారులు ముందుకు వచ్చి 'కిష్టా రెడ్డి' లాంటి అమాయకులను కాపాడుతారని పలువురు అభిప్రాయపడుతున్నారు.



పరికి చెరువు మట్టితో పూడ్చివేత






ఎఫ్టీఎల్ లో దర్జాగా మట్టివేసి కబ్జాకు యత్నం




అనుకున్నట్టుగానే.. ఐదేండ్లలో చేరువును మాయం చేసిన కేటుగాళ్లు

## బొత్సకు అచ్చెన్నాయుడు కౌంటర్

**రెండవ పేజీ తరువాయి...** ప్రారంభమైన ఏపీ శాసనసభ వర్షాకాల సమావేశాల తొలిరోజే శాసనమండలి 'మెగా డీఎస్సీ-2025' అంశంతో దద్దరిల్లింది. 16,347 ఉపాధ్యాయ పోస్టుల భర్తీలో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ వైసీపీ వాయిదా తీర్మానం ఇచ్చింది. దీనిపై సీబీఐ విచారణ జరిపించాలని, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ రాజీనామా చేయాలని డిమాండ్ చేసింది. అయితే, మండలి చైర్మన్ కె. మోషేను రాజు వాయిదా తీర్మానాన్ని తిరస్కరించి, ప్రశ్నోత్తరాలు చేపట్టారు. ఈ అంశంపై బిజినెస్ అడ్వైజరీ కమిటీ (బీఏసీ) సమావేశంలో నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. చైర్మన్ నిర్ణయంతో ఏకీభవించని వైసీపీ సభ్యులు, సభా కార్యకలాపాలను అడ్డుకుంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ.. డీఎస్సీ పేరుతో మూడు లక్షల మంది నిరుద్యోగులను ప్రభుత్వం మోసం చేసిందని, క్రీడల కోటాలో తమకు నచ్చిన వారికి ఉద్యోగాలు కట్టబెట్టారని ఆరోపించారు. దీనిపై సభలో చర్చ జరగాలని పట్టుబట్టారు.

బొత్స ఆరోపణలపై అచ్చెన్నాయుడు తీవ్రంగా స్పందించారు. "గత ఐదేళ్లలో ఒక్క డీఎస్సీ కూడా ఇవ్వని మీరు ఇప్పుడు మాట్లాడుతున్నారా?

## నిజాలు బయటకు రావాలంటే..

**రెండవ పేజీ తరువాయి..** ప్రస్తావించారు. నిజంగా గ్రూప్-1లో అక్రమాలు జరిగాయని భావిస్తే, దానితో పాటు ప్రస్తుత డీఎస్సీ ప్రక్రియపై కూడా ఒకేసారి సీబీఐ విచారణ వేయాలని ఆయన సవాల్ విసిరారు. రాష్ట్రంలో మూడేళ్ల క్రితం నుంచి ఉద్యోగార్థులు ఎదురుచూస్తున్న తరుణంలో, మెరిట్ జాబితా నిర్వహణలో పారదర్శకత లోపించిందని దుయ్యబట్టారు.

SCAN FOR MORE DATA

## నేరుగా ఓటుతోనే మేయర్, చైర్మన్!

**మొదటి పేజీ తరువాయి...** ఉంటారు. రెండవది స్థానిక సమస్యలపై పట్టు. ప్రజల మధ్య నిత్యం ఉండి, వారి కష్టాలు, అవసరాలు తెలిసిన వ్యక్తికే ప్రజలు పట్టం కడతారు. మూడవది అవినీతికి అడ్డుకట్ట. కౌన్సిలర్లను ప్రలోభపెట్టి పదవులు కొనుక్కునే సంస్కృతికి ఇకపై చోటు ఉండదు. నాలుగవది యువ నాయకత్వానికి కొత్త అవకాశాలు. పార్టీల అధిష్టానంపై ఆధారపడకుండా, ప్రజా బలంతో ముందుకు వచ్చే యువతకు ఇది బంగారు అవకాశం. ఐదవది పాలనలో వేగం, పారదర్శకత. ప్రజా సమస్యలపై తక్షణ నిర్ణయాలు తీసుకుని, అమలు చేసే అధికారం నేరుగా ఎన్నికైన నాయకుడి చేతిలో ఉంటుంది.

ఈ భారీ ఎన్నికల నిర్వహణ కోసం ప్రభుత్వం రూ.104.15 కోట్ల భారీ బడ్జెట్ ను కేటాయించింది. ఇందులో ఓటర్ల జాబితా ముద్రణ, నోటీసుల ప్రచురణకు రూ.66.60 కోట్లు, సిబ్బంది శిక్షణ, రవాణా, పోలింగ్ ఏర్పాట్లు, భద్రతకు రూ.18.30 కోట్లు, లెక్కింపు మరియు ఇతర అనుబంధ ఖర్చులకు రూ.0.86 కోట్లు, అధికారులు, పర్యవేక్షకుల వేతనాలు, ఇతర ఖర్చులకు రూ.10.56 కోట్లు ఖర్చు చేయనున్నారు. ఎన్నికలు పారదర్శకంగా జరిగేలా ప్రతి పోలింగ్ కేంద్రంలో సిసిటివి నిఘా, వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేస్తారు. ఓటర్లకు అవగాహన కల్పించేందుకు గ్రామసభలు, ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తారు. "ఒక్క ఓటు కూడా వృథా కాకుండా" చూసే బాధ్యతను అధికారులు తీసుకున్నారు.

ఈ నిర్ణయం వెలువడిన వెంటనే రాష్ట్రవ్యాప్తంగా రాజకీయ వాతావరణం వేడెక్కింది. అధికార పార్టీ నుంచి ప్రతిపక్షాల వరకు అన్ని పార్టీలు తమ వ్యూహాలను సిద్ధం చేసుకుంటున్నాయి. ఇన్నాళ్లు తెరవెనుక ఉండి పావులు కదిపిన నాయకులు ఇప్పుడు నేరుగా ప్రజల ముందుకు రావాల్సిన పరిస్థితి. "గదుల్లో ఒప్పందాలు కాదు, గడప గడపకు ప్రచారం" అనే కొత్త రాజకీయ సంస్కృతి మొదలైంది. పార్టీలు తమ మేనిఫెస్టోలలో స్థానిక సమస్యలైన రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, చెత్త నిర్వహణ, వీధి దీపాలకు ప్రాధాన్యత ఇస్తున్నాయి. సంభావ్య అభ్యర్థుల ఎంపికలో కుల, మత సమీకరణలతో పాటు సేవా దృక్పథం, ప్రజా ఆమోదం కూడా ప్రధాన ప్రమాణాలుగా మారాయి.

పట్టణ ప్రజల్లో ఈ నిర్ణయంపై భారీ ఆసక్తి నెలకొంది. తమ ఊరి బాగోగులను చూసుకునే నాయకుడిని తామే నేరుగా ఎన్నుకునే అవకాశం రావడంతో ప్రజలు ఉత్సాహంగా ఉన్నారు. గతంలో పరోక్ష ఎన్నికల తర్వాత గెలిచిన నాయకులు ప్రజలకు అందుబాటులో ఉండేవారు కాదనే విమర్శలు ఉండేవి. ఇప్పుడు ఆ పరిస్థితి పూర్తిగా మారుతుంది. "మా సమస్య మాకు తెలుసు, మా నాయకుడిని మేమే ఎన్నుకుంటాం" అనేది ప్రజల నినాదంగా మారింది. ఈ ఎన్నికలతో పట్టణాల్లో రాజకీయ చైతన్యం పెరిగి, ప్రజా భాగస్వామ్యం అధికమయ్యే అవకాశం ఉంది.

అధికార యంత్రాంగం కూడా ఈ ప్రక్రియ కోసం ముమ్మరంగా సిద్ధమవుతోంది. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ పనులు, కొత్త ఓటర్ల నమోదు, పోలింగ్ కేంద్రాల గుర్తింపు, సిబ్బంది నియామకం, శిక్షణా కార్యక్రమాలు ఒకేసారి జరుగుతున్నాయి. చట్టానికి అసెంబ్లీ ఆమోదం లభించిన వెంటనే రాష్ట్ర ఎన్నికల సంఘం పూర్తి షెడ్యూల్ ను విడుదల చేసే అవకాశం ఉంది. ఈసారి ఎన్నికల్లో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలతో పాటు ఓటరు ధృవీకరణ పత్రాలను కూడా వినియోగించనున్నారు.

మొత్తంగా చూస్తే ఇది కేవలం ఎన్నికల విధానంలో మార్పు మాత్రమే కాదు. ఇది పట్టణ పాలనలో ఒక విప్లవాత్మక మార్పు. ప్రజల చేతిలో అధికారాన్ని ఉంచి, స్థానిక స్వపరిపాలనను బలోపేతం చేసే దిశగా వేసిన పెద్ద అడుగు. "ప్రజల కోసం, ప్రజల చేత, ప్రజల పాలన" అనే గాంధేయన్ సూత్రానికి నిజమైన అర్థం ఇస్తుంది. గతంలో జరిగిన లోపాలను సరిదిద్ది, భవిష్యత్తులో మెరుగైన పట్టణాల నిర్మాణానికి ఇది పునాది వేస్తుంది. ఈ నిర్ణయం దేశంలోని ఇతర రాష్ట్రాలకు కూడా ఒక ఆదర్శంగా నిలుస్తుంది. రాబోయే రోజుల్లో పట్టణాల రూపురేఖలే మారనున్నాయి. ఎందుకంటే ఇప్పుడు తాళం చెవి ప్రజల చేతిలో ఉంది. ప్రజలే నిర్ణయిస్తారు, ప్రజలే గెలిపిస్తారు, ప్రజలే పాలనను శాసిస్తారు.

## బీజేపీ కొత్త టీమ్‌లో ఏపీకి 3 కీలక పదవులు

**రెండవ పేజీ తరువాయి..** రావడం ప్రాధాన్యం సంతరించుకుంది. బీఎల్ సంతోష్ జాతీయ ప్రధాన కార్యదర్శి (సంస్థాగత)గా కొనసాగనున్నారు. శివప్రకాశ్, సౌదాన్ సింగ్ సంయుక్త ప్రధాన కార్యదర్శులు (సంస్థాగత)గా బాధ్యతలు చేపట్టనున్నారు. పీయూష్ గోయల్‌కు జాతీయ కోశాధికారి పదవి ఇచ్చారు. ఈశాన్య రాష్ట్రాల సమన్వయకర్తగా సంబిత్ పాత్రను నియమించారు. పార్టీ మీడియా వ్యవహారాలను అనిల్ బలూనీ చూసుకోనున్నారు.

తెలంగాణకు మాత్రం ఈసారి జాతీయ కార్యవర్గంలో ప్రాతినిధ్యం దక్కలేదు. గతంలో డీకే అరుణ జాతీయ ఉపాధ్యక్షురాలిగా కొనసాగారు. ఓబీసీ మోర్చా అధ్యక్షుడిగా లక్ష్మణ్ బాధ్యతలు నిర్వహించారు. కొత్త టీమ్‌లో ఇద్దరికీ చోటు దక్కలేదు. తెలంగాణలో పార్టీని మరింత విస్తరించడమే తదుపరి లక్ష్యమని బీజేపీ చెబుతున్న సమయంలో.. జాతీయ స్థాయి పదవుల్లో రాష్ట్రానికి ప్రాతినిధ్యం లేకపోవడం రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీస్తోంది.

## 8 లక్షల డ్రైవర్లు.. 41 లక్షల కస్టమర్లు

**రెండవ పేజీ తరువాయి..** బైక్ ట్యాక్సీలు, ఆటోలు, ఎకానమీ క్యాబ్‌లు, ప్రీమియం సెడాన్లు, ఎస్‌యూవీలు, రెంటల్స్, అవుట్‌స్టేషన్ ప్రయాణాలు, ముందస్తు బుకింగ్ సేవలు అందుబాటులో ఉన్నాయి. ధరల్లో పారదర్శకత ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు సంస్థ తెలిపింది. సర్జ్ ప్రైసింగ్, అదనపు ప్లాట్‌ఫామ్ ఛార్జీలు ఉండవని పేర్కొంది.

మహిళల కోసం 'సారథి దీదీ' సేవను కూడా తీసుకొచ్చింది. దీని ద్వారా మహిళా ప్రయాణికులు మహిళా డ్రైవర్లను ఎంచుకోవచ్చు. మహిళలు డ్రైవింగ్ రంగంలోకి రావడానికి 'బైక్ దీదీ' కార్యక్రమాన్ని కూడా చేపట్టింది. డ్రైవర్లను ఈ-శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేయడంతో సామాజిక భద్రతా ప్రయోజనాలు పొందే అవకాశం కల్పిస్తున్నారు. ప్రమాద, ఆరోగ్య బీమా సదుపాయాలను కూడా భాగస్వామ్య సంస్థల ద్వారా అందిస్తున్నారు.

Owned and Published by Sirigiri Varadaraju, RNI No: APTEL/2018/76747, Dr. Narsimlu Yellampally - Bureau Chief, Telangana, 9618907705, email: pressmanbharat@gmail.com,
Telangana State Office: Plot No. A/9, Phase -I, Alwyn Colony, Kukatpally, Hyderabad - 72, Telangana, India. website: https://epaper.navatharam.com